క్లుప్తంగా

జర్నలిస్ట్ కాలనీకి మరో సీసీ రోడ్డు

పరకాల : పరకాల మున్సిపాల్టీ పరిధిలోని 20వ వార్డులోని జర్నలిస్ట్ కాలనీని మరో సీసీ రోడ్డు మంజూరు చేయించడానికి చొరవ తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. ఆ కాలనీని గురువారం ఆమె సందర్శించి స్థానికులతో మాట్లాడారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా మరో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వార్డు ప్రధాన కార్యదర్శి రెండ్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామెర : స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఏఈ గుర్రం రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు మరమత్తులు, పీఎంఐ (విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు) నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని స్పష్టం చేశారు. హెచ్‌టీ, క్రషర్ మిల్స్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్కతుర్తి : ఈనెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన తెలంగాణ భరోసా సభ వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆరెపల్లి సారయ్య ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబ పాలనతో బహుజనులు తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో సుమారు 30 వేల మంది నిరుద్యోగ యువత మానసిక వేదనకు గురయ్యారని చెప్పారు. స్వరాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా నేటికీ రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. భరోసా సభకు లక్షలాదిగా బహుజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుల చారి, శనిగరం రమేష్, ప్రకాశ్, అఖిలాష్, రాజు, అంబాల సంతోష్, ఎర్ర సుమన్, డీజే.రాజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు భద్రత సూచనలు పాటించాలి

హసన్‌పర్తి: విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ కోసం వినియోగదారులు భద్రత సూచనలు పాటించాలని ఏడీఈ గంగారెడ్డి సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున పలు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈక్రమంలో రక్షణ పరికరాలను ఉపయోగించి విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ మంగమ్మ, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, రౌతు రమేష్‌కుమార్, లైన్‌మెన్లు రాజేందర్, కుమారస్వామి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మడికొండ: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై మడికొండ ఎస్సై దివ్య ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితుల కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని తెలిపారు. బ్యాంక్ ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబల్ జయ్‌రాజ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పోలీసుల చేయూత

హసన్‌పర్తి: షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమై వీధిన పడిన మల్లారెడ్డిపల్లికి చెందిన బయ్యు కుమారస్వామి కుటుంబానికి పోలీసులు చేయూతనందించారు. బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను గురువారం అందించారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, నాయకుడు కేతపాక భగత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు ప్రాధాన్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : వడగళ్ల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఆ నియోజకవర్గంలోని పరకాల, ఆత్మకూరు, నడికూడ, దామెర, గీసుగొండ, సంగెం, ఖిలా వరంగల్ మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై అధికారులతో హనుమకొండలోని తన నివాసంలో గురువారం ఆయన సమీక్షించారు. ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వర్షాల వల్ల నియోజకవర్గంలో వరి, ఇతర పంటలు వేసిన రైతులు భారీగా నష్టపోయారని ఆందోళన వెలిబుచ్చారు. పంటలు నష్టపోయిన రైతుల జాబితా, వివరాలు పూర్తిస్థాయిలో అంచనా వేసి సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అన్ని విధాలా న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లో రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు సర్వే చేయడంలో సమర్థవంతంగా పని చేయాలని కోరారు. బాధితులెవరికీ అన్యాయం జరగకుండా పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేయాలని చెప్పారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతు పక్షపాతిగా అభివర్ణించారు. బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఏడీఏ రవీందర్, ఏఓలు శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంతో అవకాశాలు మెండు

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల : రసాయన శాస్త్రం చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ కళాశాలలో రసాయన శాస్త్రంపై విద్యార్థుల కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఆహార పరిశ్రమల్లో, ఫార్మ పరిశ్రమల్లో బీఎస్సీ రసాయన శాస్త్ర విద్యార్థుల అవసరం ఎక్కువగా ఉందన్నారు. యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులుగా, శాస్త్రవేత్తలుగా జీవితంలో రాణించవచ్చని చెప్పారు. రసాయన శాస్త్రంలో విద్య అభ్యసించిన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. రసాయన శాస్త్రం పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకుని సులువుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. తొలుత రిసోర్స్‌పర్సన్ డాక్టర్ జీ.మల్లికార్జున్ మాట్లాడారు. రసాయన శాస్త్ర విద్యార్థులకు ఏయే రంగాల్లో ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయో క్లుప్తంగా వివరించారు. పెట్రోలియం, సౌందర్య ఉత్పత్తుల తయారీ, ఎరువుల, వస్త్ర పరిశ్రమలతోపాటు అనేక రంగాలల్ల రాణించేందుకు రసాయన శాస్త్ర విద్యార్థులకు అవకాశాలు భారీగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగ అధిపతులు డాక్టర్ ఎం.అరుణ, ఆర్.కుమారస్వామి, అధ్యాపకులు డాక్టర్ ఎల్.ఇందిరదేవి, డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ వి.రాజయ్య, డాక్టర్ జీ.ఓదెలు, అశోక్ మోరె, ఎ.అనిల్ కుమార్, సీహెచ్ సుస్మిత, దుప్పటి సంజయ్, జే.రాజు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

ఆత్మకూరు : అధికారులు, ప్రజాప్రతినిధుల నడుమ సమన్వయం ఉంటేనే మండలంలో నెలకొన్న తాగు నీటి, రోడ్లు, ఇతర ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ మార్క సుమలత స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు అంకితభావంతో పని చేస్తేనే సత్ఫలితాలు వస్తాయని తేటతెల్లం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. తొలుత పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. పెద్దాపూర్ ఎంపీటీసీ కమలాపురం రమేష్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు భారీగా పంటలు నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంగా వ్యవహరించి నష్టాన్ని సరైన విధంగా అంచనా వేయాలని సూచించారు. బాధితులందరికీ పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు

● ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పూజలు



గ్రామ దేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత గ్రామశిల బొడ్రాయి వేడుకలు గురువారం ముగిశాయి. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కరోనా మహమ్మారి రెండేండ్లపాటు సమాజాన్ని అల్లకల్లోలం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజలు తేరుకుంటున్నారని చెప్పారు. గ్రామాన్ని, ప్రజలను సుభిక్షంగా, సుఖసంతోషాలతో చూడాలటూ గ్రామ దేవతలను కోరుకున్నారు. తొలుత అర్చకులు మంటప స్థాపిత దేవతల పూజలు, అధివాస హోమాలు, మూలమంత్ర హోమాలు, గర్త న్యాసము, ధాతుబీజన్యాసములు, యంత్ర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, నేత్రోన్మీలనం, దిష్టికుంభం, మహాపూర్ణాహుతి, అవభృద స్నానం, దీక్ష విరమణ, వేద ఆశీర్వచనం, పండిత సన్మానం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమ అనంతరం భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సర్పంచ్ బొయినపల్లి రజిత దేవేందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ వంగ రవీందర్, నాయకులు తంగెడ మహేందర్, గొల్లె మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు మాజీ ఎమ్మెల్యే పూజలు



గ్రామ దేవతలను పూజిస్తున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల ముగింపు వేడుకల సందర్భంగా గ్రామ దేవతలకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. తొలుత ఆయన గ్రామ దేవతలను దర్శించుకున్నారు. మనోభావాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని వేడుకున్నారు. ఆయన వెంట నాయకులు ఇంద్రసేనారెడ్డి, రావుల రమేష్, మల్లారెడ్డి తదితరులున్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



రైతులతో మాట్లాడుతున్న భిక్షపతి, తదితరులు

ధర్మసాగర్ : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మండలంలోని దేవునూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆయన గురువారం సందర్శించి పరిశీలించారు. నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భిక్షపతి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలన్న నిబంధనతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తరచూ వర్షాలు కురుస్తుండడంతో ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేదని తెలిపారు. తేమ 17 శాతానికి మించొద్దన్న నిబంధన వల్ల రైతులు నష్టపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అకాల వర్షాలకు వరితోపాటు మొక్కజొన్న, మిర్చి, మామిడి రైతులు సైతం నష్టపోయిన క్రమంలో వారికి కేంద్ర ప్రభుత్వం పరిహారం అందించాల్సి ఉందన్నారు. సత్వరమే సర్వే చేయించి ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ శంకర్, మండల కార్యదర్శి బట్టు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం



ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితులు ఆరుట్ల మాధవమూర్తి, నర్సింహాచార్యులు వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు (శుక్రవారం) శ్రీవేణుగోపాలస్వామి జాతర జరుగుతుందని అర్చకులు మాధవమూర్తి తెలిపారు. భజన మండలి సభ్యుల భజన కీర్తనలు అలరించాయి.

వేడుకగా శ్రీమత్స్యగిరి స్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

శాయంపేట : తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమత్స్యగిరి స్వామి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, యాగ్నికులు రంగనాధచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని ఘనంగా చేశారు. అనంతరం సామల రాజమణి భిక్షపతి దంపతులు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించగా వారు పాల్గొని ప్రారంభించారు. పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, సర్పంచ్ కందగట్ల రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, గ్రామస్తులు మామిడి శ్రీనివాస్, గన్ను వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



పంటలను పరిశీలిస్తున్న రవి, తదితరులు

దామెర : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి విమర్శించారు. మండలంలోని ల్యాదెళ్ల, పులుకుర్తి, కోగిల్వాయి. సింగరాజుపల్లి, పసరగొండ గ్రామాల్లో ఆ పార్టీ బృందం గురువారంపర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. మండలంలో వరి, మొక్కజొన్న, మిరప పంటలతోపాటు కూరగాయలు సాగు చేసిన రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధిత రైతులందరికీ వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబి సాంబయ్య, భాస్కర్, రాజేష్, అఖిల, సునీత, సంధ్య, రజని, కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి సమష్టి బాధ్యత



దామెర : గ్రామాభివృద్ధిని సమష్టి బాధ్యతగా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అభివర్ణించారు. మండలంలోని కోగిల్వాయి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి, నీటి, ఇతర పన్నులు నూరు శాతం వసూలయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు కలిగిన కూలీలందరూ వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, ఇతర సమస్యలు పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సంగరబోయిన మౌనిక కిరణ్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి సరళ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలోని శివలింగ మార్కండేయస్వామి ఆలయంలో నవగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం మొదటి రోజు నవగ్రహ విగ్రహాల ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహవచనము, రక్షబంధనం, రుత్విక్ వరణము, మృత్సంగ్రహణము, అంకురార్పణ నిర్వహించిన విషయం తెలిసిందే. రెండో రోజు గురువారం వాస్తు హోమం, పర్యగ్నికరణము, మూలమంత్ర హవనము, పంచగవ్య స్నపనము, జలాధివాసము, క్షీరాధివాసము, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, ద్వారతోరణ ధ్వజకుంభ ఆరాధన, అగ్నిముఖము, నిత్యహోమం, మూలమంత్ర హవనములు నిర్వహించారు. నేడు (శుక్రవారం)తో వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

దర్మసాగర్ : ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఆ పార్టీ ప్రతినిధి బృందం గురువారం వరి, మొక్కజొన్న పంటలను సందర్శించి నష్టాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా రమేష్ రాజా మాట్లాడారు. పంటల నష్టాన్ని అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు సేకరించడం లేదన్నారు. ప్రభుత్వం గతంలో ప్రకటించిన పరిహారం ఇప్పటికీ అందించకపోగా కొత్తగా మళ్లీ పరిహారం చెల్లిస్తామనడం రాజకీయ ఎత్తుగడ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి కొర్రీలు పెట్టకుండానే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, పరిహారం త్వరగా అందించి రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు రొయ్యల రాజు, గోల్కొండ కుమార్, దామెర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మాధవరెడ్డి

ధర్మసాగర్ (వేలేరు) : నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేలేరు మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కార్ డ్రైవింగ్ శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ కాయిత మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీఈఓ భరత్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్' నినాదంతో వివిధ రంగాల్లో రాణించేలా ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వేలేరులో నిరుద్యోగ యువతకు ఉచిత కార్ డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఉద్యోగం కూడా ఇప్పిస్తామన్నారు. సర్పంచ్ మాధవరెడ్డి మాట్లాడుతూ 15 రోజులు సాగే శిక్షణ శిబిరాన్ని గ్రామంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఉచితంగా శిక్షణ శిబిరాలు నిర్వహించడం పట్ల ఫౌండేషన్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. నిరుద్యోగ యువత శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం యువత సెల్ నంబర్ 88864 35973లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, ఎంపీటీసీ ఇట్టబోయిన సంధ్య, నిర్వాహకులు కిరణ్, రాజు, శిక్షణ అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'చందర్‌రావు సేవలు అభినందనీయం'



చందర్‌రావును సన్మానిస్తున్న మార్కెట్ వ్యాపారులు, ఉద్యోగులు

వరంగల్: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్–2 కార్యదర్శిగా తోట చందర్‌రావు అందించిన సేవలు అభినందనీయమని వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (జేడీఏ) ఇన్నారపు మల్లేషం కొనియాడారు. చందర్‌రావు పదోన్నతిపై నల్లగొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–1 కార్యదర్శిగా నియమితులవగా గురువారం రాత్రి మార్కెట్ ఉద్యోగులు, వ్యాపారులు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఎం మల్లేషం, డీఎంఓ ప్రసాదరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి రాహుల్ మాట్లాడారు. చందర్‌రావు ఉద్యోగ నిర్వహణలో వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. చందర్‌రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి వేద ప్రకాశ్, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, కూరగాయల వర్తకం సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, కాటారం రాజు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, మార్కెట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారయ్య, గ్రేడ్ –2 కార్యదర్శి బియాబానీ, ఏఎంఎస్‌లు జన్ను భాస్కర్, శ్రీనివాస్, లాషరిఫ్, కృష్ణయ్య, వెంకన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులందరికీ పట్టాలివ్వాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్న అర్హులైన పేదలకు జీఓ నంబర్ 58, 59 ప్రకారం వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని పలు ప్రాంతాల్లో గత 15 ఏళ్లుగా ఇళ్లులేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వ పరమైన ఓటరు, ఆధార్, రేషన్ కార్డులు, కరెంట్ మీటరు, ప్రభుత్వ పరమైన అన్ని అర్హతలు ఉన్నాయని వివరించారు. అన్ని అర్హతలున్న నిరుపేదలకు వెంటనే ప్రభుత్వం వ్యక్తిగత పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, గుమ్మడి రాజుల రాములు, మంద సంపత్, తదితరులు పాల్గొన్నారు.